# రుద్రాభట్ల నరసింగరావు!

పదిహేడేళ్ళ క్రిందట అనారోగ్యపు శరీరాన్నీ, కళ్ళల్లో ప్రాణాన్నీ మోసుకుంటూ ఒకమిత్రుడివెంట తొలిసారిగా కలిశాడు రుద్రాభట్ల నరసింగరావు. అంతకు క్రితం కొంతకాలంనించీ అలాంటి పరిస్థితిలోనేవుంటూ, చేస్తున్న ఉద్యోగం వదులుకున్నట్టు అప్పుడే విన్నాను. ఆ అనారోగ్యం అతన్ని మిత్రుల్నించి దూరం చేసింది. ప్రజల మధ్యనించి దూరం చేసింది. ఈ పదిహేడేళ్ళుగా అతను జనం మధ్యకు రావడానికి భయపడ్డాడు. ఇల్లొదిలి బైటికి కదిలేవాడుకాదు, అతన్ని అర్థం చేసుకున్న మిత్రులు కూడా అంతంత మాత్రమే. సుమారు పదేళ్ల విజయనగరంలో వున్నా ఆ వూళ్ళో రచయితలకు అతను ఆ వూళ్ళోనే వున్నట్టు తెలీదు, అప్పటికే అతను చక్కటి కథలు చాలా రాశాడు, ఉత్తమ కథలు సేకరించి బాపూ చేసిన సంకలనంలో అతని కథ వుంది! ఒక నవలిక పుస్తకంగా అచ్చయింది. మంచి కథకుడిగా స్థిరపడ్డాడు. అలాటివాడిగురించి ఊరి జనమేకాదు, ఊళ్లో రచయితలే పట్టించుకోకపోవడంఆశ్చర్యమే.ఓసారి అతన్ని వెతుక్కుంటూ వెళ్తే ఓ పెంకుటింటి చీకటిగదిలో కూచుని కిటికీలోంచి వీధిలోకి చూస్తూ కనిపించాడు. వెతుక్కుంటూ వచ్చిన నన్ను చూసి అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మాటలో సంతోషపు తొట్రుపాటు కనిపించింది. ఒంటిమీద అదే అనారోగ్యపు బరువు. కళ్ళల్లో అలానే కొట్టుకుంటూ వేలాడుతోన్న ప్రాణం. అనారోగ్యం అతని ఊపిరితిత్తుల్ని కొరికితింటున్న తొలి రోజుల్లో అతనికి జీవితం మళ్ళీ చిగురిస్తుందన్న ఆశ వుండేది. ఆ ఆశ ఒక్క అయిదేళ్ళు. ఆటు తర్వాత రేపటి ఉదయాన్ని తను మళ్ళీ చూడగలనా అన్న భయం. ఆ భయంతోనే పదిహేనేళ్ళు గడిపాడు. తను మరిక బ్రతకడు అని తెలిసి ఏ రోజుకారోజు జీవితాన్ని పొడిగించుకుంటూ పదిహేనేళ్ళు బ్రతకడం, అదెంత భయంకరమో అతనికి ఒక్కడికే తెలుసు. విజయనగరం వాదిలి తమ్ముడిమీద

## చెప్పాపెట్టకుండా చల్లగాపోయాడు!

ఆధారపడి అతనివెంట పాల్వంచకు వెళ్ళిపోయాక మళ్ళీ అతన్ని చూడలేదు. అప్పుడప్పుడు తను బ్రతికే వున్నట్టు అకస్మాత్తుగా ఓ కార్డు మాత్రం వొచ్చేది. అప్పుడప్పుడూ, అక్కడక్కడా పత్రికలలో అతని కథలు కనిపించేవి.

రుద్రాభట్ల అల్ప సంతోషి. గోదారి నీళ్ళల్లో సూర్యకిరణాల మెరుపులన్నా, కొబ్బరి తోటల్లో వెలుగునీడల అల్లిక అన్నా, సరుగుడుచెట్ల సంగీతమన్నా, లంగా వోణీలు వేసుకొని నిశ్చింతగా, హాయిగా సీతాకోకచిలుకల్లా వీధుల నిండా రంగులు పరిచే అమ్మాయిలన్నా, ఇసుకలో సూర్యుడి కిరణాల పరావర్తనమన్నా, కిటికీలోంచి వెల్తురు చారగా కనిపించే రోడ్డన్నా అతనికి చాలా యిష్టం. ప్రతి చిన్న విషయానికీ తొందరగా చలించిపోయే అతి సున్నితమైన మనస్సు. అతని కథల్లోని పాత్రల్లో ఎక్కువగా అతనే కనిపిస్తుంటాడు. అతని కథలంటే నాకు చాలా యిష్టం. కారణం, నేనూ అలాటిపాత్రల్నే అప్పట్లో సృష్టించాను. అతని కథల్ని చూసి అంతమంచి యితివృత్తం నాకు దొరక్కుండా అతనికి దొరికినందుకు అసూయకూడా పడేవాడిని. ప్రేమ కథలే కావచ్చు కాని అవి సంఘటన ప్రధానమైనవి కాక మనస్తత్వ చిత్రణ ప్రధానంగా సాగే రచనలు. మామూలు ప్రేమ కథలకి భిన్నమైన పోకడలో వుండేవి. అందుకే నాకవి యిష్టం.

రుద్రాభట్ల నరసింగరావు చివరి వరకు రాస్తూరాస్తూ, చెప్పాపెట్టకుండా చల్లగా చనిపోయాడు. పదిహేనేళ్లుగా అతని లాగానే ఏ రోజు కారోజు అనుకుంటూనే వున్నా, అకస్మాత్తుగా ఆ వార్త తెలియడంతో, అతను మరికలేడు మరిక రాయడు అనిపించి గుండె మూగబోయింది.

—శీలావీర్రాజు

---

రుద్రాభట్ల నరసింగరావు

చిన్నకథ

# చంపకమాల

రాజు అద్దె సైకిళ్ళ మీద తెగ తిరుగుతాడు. అతనికి హడావిడిగా వుంచే చెప్పలేం, ఏదొక్క సైకిలు దొరికినా తీసుకుని వెళ్ళిపోతాడు. తొందర లేకపోయిందా కేరేజి పూర్తి గేరు కేసు అన్నీ వున్న కొత్త సైకిలుని ఎంచుకుని పట్టు కెళతాడు. నిత్యకాతా దారు పట్ల వుండే గౌరవం కొద్దీ కొట్ల వాళ్లు కూడా వున్నంతలో కొత్త సైకిలుని అతన్నే పట్టుకెళ్ళమంటారు.

ఆ రోజు పట్టుకెళ్ళినదీ కొత్త సైకిలే.

పట్నం వెళ్ళి దాన్ని దర్జాగా కొట్ల ముందు ఆపు చేస్తున్నాడు. కొనుక్కో-వలసినవి కొనుక్కుని సంచులలో వేసుకుంటున్నాడు.

ఇలా వుండగా అతనికొక ప్రమాదం తటస్థపడింది.

ఆ ప్రమాదం ఒక ప్రమద రూపంలో వచ్చింది. అతనున్న షాపులోకే. అతనికొక గజం దూరంలోకి వచ్చింది.

ఆమెరాకని మొదట ఆమె జడలోని సంపెంగ పువ్వులు తెలియజేసేయి. ఆమె ఆ సంపెంగ పువ్వు రంగు గలిగినవే చీరా, జాకెట్టూ వేసుకుంది.

మెళ్ళో గొలుసు వుందో లేదో తెలియడం లేదు. అంత బంగారు కాంతితో వుందీ అమ్మాయి, అనికాస్త అతియోశక్తిగా అనుకున్నాడు రాజు.

ఆమెని వదిలి వెళ్ళ కూడదంటే కనీసం వంద రూపాయల వస్తువు లయినా యింకా తను కొనాలి

అంచేత ఎలాగో వదిలి ఆమెనే చూస్తూ వచ్చి సైకిలు అందుకుని వెళ్లేడు.

ఒక ఫర్లాంగు దూరం జనంలో నుంచి సైకిలు పోనిచ్చేడు. ఒకసారి బెల్ కొట్టవలసి వచ్చింది. బెల్లు చేతికి తగలలేదు. ఏమిటి చెప్మా అనుకుంటూ అప్పుడు హేండిల్ వైపుచూస్తే బెల్లు పక్కనలేదు. మధ్యన వుంది. అంతే గాక అడ్డుగా వుండవలసిన రాడ్ లేదు. దానికి బదులు వంగిన రాడ్ కింద వుంది.

చచ్చేంరా భగవంతుడా! నా సైకిలు యీ పాటికి ఎవడో పట్టుకుని వెళ్ళిపోడుకదా? అద్దె సైకిలు అయిదు కాగితాలయినా కక్కక తప్పదు.

గిర్రున సైకిలు తిప్పి కొట్టుకి వచ్చేడు.

సంపెంగ పువ్వుల రంగు రుమాలుతో మొహం తుడుచుకుంటూ తన సైకిలు దగ్గిర ఆ అమ్మాయి నిలబడి వుంది.

ఆమెని అప్పుడే నలుగురూ నాలుగూ అడుగుతున్నారు.

రాజూ ఆ అమ్మాయీ ఒకర్నొకరు చూసుకోగానే అమ్మయ్య అనుకున్నారు.

కొట్టు వాడు సంతోషించేడు—తన ఖాతాదారులకి ముఖ్యంగా ఆ అమ్మాయికి కలిగిన బాధపోయినందుకు.

ప్రజలు సంతోషించేరు — ఆ అమ్మాయికేదో తాముసహాయ పడినట్టు

ఈ కథ విన్న రాజు ఊళ్ళోని సైకిలు షాపతను కూడా సంతోషించేడు—తన సైకిలు పట్టుకెళ్ళబట్టి ఆ అమ్మాయి కెవరికో ఉపకారం జరిగినట్టు.

రాజు మాత్రం చంపకమాలని—దేహచ్ఛాయ, పువ్వులు, చీరా, జాకెట్టూ, గొలుసూ, రుమాలుతో సహా-మరిచిపోలేక పోయేడు. ❋